క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నుంచి కంచేటి సాయి బహిష్కరణ



సాక్షి, నరసరావుపేట : పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గానికి చెందిన కంచేటి సాయిబాబు (సాయి) పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు ఆయన్ను పార్టీ నుంచి బహిష్కరించారు. ఈమేరకు పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. గత కొన్నిరోజులుగా పార్టీకి స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు వ్యతిరేకంగా కంచేటి సాయిబాబు వ్యవహరిస్తుండడంతో పార్టీ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

అభయాంజేయస్వామికి ప్రత్యేక పూజలు

పిడుగురాళ్ల: పట్టణంలోని మార్కెట్‌యార్డు వద్ద గల అభయాంజనేయస్వామి దేవాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి కుంకుమ పూజలు, మంగళహారతులు ఇచ్చి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

శ్రీనివాస మహాల్ ప్రారంభం



వెల్దుర్తి: మాచర్ల పట్టణంలోని శ్రీనివాసమహల్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలు మంగళవారం రాత్రి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో ఎంతో కాలంగా విశేష ఆదరణ పొందిన ఈ శ్రీనివాసమహల్‌ను పునః ప్రారంభించడం సంతోషకరమన్నారు. వినోదం కోసం ఆధునిక సదుపాయాలతో నూతన హంగులతో నిర్మించడం అభినందనీయమని నిర్వాహకులను అభినందించారు. సినిమా హాల్‌ను ప్రారంభించినంతన అనంతరం సినిమాను వీక్షించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జాని, సైదయ్య, ఆంధ్రయ్య తదితరులున్నారు.

బైక్ రైడింగ్‌ను వీక్షించేందుకు వచ్చిన వ్యక్తులకు కౌన్సిలింగ్



బైక్‌లను స్వాధీనం చేసుకుంటున్న పట్టణ పోలీసులు

పిడుగురాళ్ల: బైక్ రైడింగ్‌ను వీక్షించేందుకు వచ్చిన వ్యక్తులకు పట్టణ పోలీసులు కౌన్సిలింగ్ ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన బైక్ రైడర్ బోనీ ఓఎక్స్ అనే ఐడీ కలిగిన వ్యక్తి పిడుగురాళ్ల పట్టణంలో బైపాస్ రోడ్డులో రైడింగ్ నిర్వహిస్తున్నామని, వీక్షించే వారు రావచ్చునని, రైడింగ్‌లో పాల్గొనే వారు కూడా రావచ్చునని ఇన్‌స్ట్రాగామ్‌లో లోకేషన్‌తో పోస్ట్ చేశాడు. వెంటనే దీనిని చూసిన పిడుగురాళ్లకు చెందిన పదుల సంఖ్యలో యువకులంతా ఖలీల్ దాబా వద్ద గల బైపాస్ రోడ్డుకు చేరుకున్నారు. ఇదే విషయం పట్టణ పోలీసులకు తెలియడంతో వెంటనే బైక్ రైడింగ్ జరిగే ప్రదేశానికి వెళ్లగా రైడింగ్ నిర్వహించే రైడర్ బైక్‌ను వేగంగా తోలి పోలీసులకు అందకుండా వెళ్లిపోయాడు. అయితే రైడింగ్‌ను వీక్షించేందుకు వచ్చిన యువకులంతా మైనర్లు కావడంతో వారికి పట్టణ సీఐ ఎం. మధుసూదన్‌రావు కౌన్సిలింగ్ ఇచ్చి పంపించారు.

దమ్ము ట్రాక్టర్ తిరగబడి రైతు మృతి



పిడుగురాళ్ల: దమ్ము ట్రాక్టర్ తిరగబడి రైతు మృతి చెందిన ఘటన మండలంలోని గుత్తికొండ గ్రామంలో బుధవారం జరిగింది. సంఘటనకు సంబంధించి బంధువులు తెలిపిన వివరాల... గ్రామానికి చెందిన నల్లబోలు రామారావు(53) తన సొంత పొలంలో తన ట్రాక్టర్‌తో తనే సొంత మాగాణి పొలంలో దమ్ము ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న సమయంలో దమ్ము చక్రాలకు లోడు పట్టి ట్రాక్టర్ ప్రమాదవశాత్తు తిరగబడింది. దీంతో ఇరుగు పొరుగు రైతులు ట్రాక్టర్‌ను తొలగించే ప్రయత్నం చేసినప్పటికి ఫలితం లేకుండా పోయింది. మరో ట్రాక్టర్ తీసుకొని వచ్చి తిరగలు పడిన ట్రాక్టర్‌ను బయటకు తీశారు. అప్పటికే నల్లబోలు రామారావు ట్రాక్టర్ క్రింద పడి మృతి చెంది ఉన్నాడు. మృతుని చిన్నకుమారుడు నల్లబోలు నాగరాజు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం తెలుసుకున్న పట్టణ ఎస్ఐ షేక్ పఠాన్ రబ్బానీ ఖాన్ సంఘటనా స్థలానికివెళ్లి సంఘటనకు గల కారణాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు. మృతునికి భార్య లక్ష్మీతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు. ప్రమాదం జరిగిన సమాచారం తెలుసుకున్న గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గుత్తికొండ గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపి తమకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

పేదల సొంతింటి కల సాకారం చేస్తాం

- నూతన ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- శివారు బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలో 420 మందికి పట్టాలు పంపిణీ
- హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్లరూరల్: ఏళ్ల తరబడి తమకు పట్టాలు కేటాయించండి..మేము కూలీ, నాలి చేసుకుని జీవించటమే తప్పా తమకు ఎలాంటి వ్యాపారాలు లేవని, తాము ఇప్పుడు పరిస్థితుల్లో ఒక సెంటు భూమి కొనాలంటే తమ రెక్కల కష్టంతో కొనలేమని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి బాబు జగ్జీవన్‌రామ్ కాలనీ వాసులు మొరపెట్టుకున్నారు. మేము ఏళ్ల తరబడి ఈ బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలోనే ఉంటున్నామని, గత పాలకులు తమను ఓటు బ్యాంక్‌గా మాత్రమే ఉపయోగించుకున్నారని, తమకు ఎలాంటి సౌకర్యం కల్పించలేదన్నారు. అంతేకాకుండా గతంలో అధికారుల చుట్టూ తిరిగినా తమకు పట్టాలు ఇవ్వాలని అర్జీలు మీద అర్జీలు దాఖలు చేశామని కానీ వారు వాటిని చెత్తబుట్టలకే పరిమితం చేశారని వారు చెప్పుతుంటే కన్నీటి పర్యంతమవ్వాల్సిందే. అలాంటి వారి జీవితాల్లో సొంతింటి కలను సాకారం చేశారు గురజాల నియోజకవర్గ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, అధికారులు బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలో ఎంత మంది అంతే ఉన్నారో వారందరికి పట్టాలు వెంటనే కేటాయించేలా చూడాలని ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని జానపాడు గ్రామ శివారు బాబు జగ్జీవన్‌రామ్ కాలనీలో ప్రభుత్వ స్థలంలో గత 12 ఏళ్ళుగా ఇళ్లు, గుడిసెలు వేసుకుని కూలీలుగా జీవనంసాగిస్తున్నారు. వారికి ఇళ్ల పట్టాలు కేటాయించాలని ఎన్నో సార్లు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఫలితం రాలేదు. ఇటీవల శివారు కలనీల్లో ఎమ్మెల్యే కాసు మమేష్ రెడ్డి పర్యటిస్తున్న సమయంలో కాలనీ వాసులంతా ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి నిన్నవిస్తూ మేము మిమ్మల్నే నమ్ముకున్నామన్నా మీరైనా మాకు పట్టాలివ్వాలని చెప్పటమే ఆలస్యం వెంటనే అధికారులకు ఆదేశాలు జారీ చేయడం 40 రోజుల్లోనే 420 కుటుంబాల వారికి ఇళ్ల పట్టాలు కేటాయించారు. అంతేకాకుండా వారికి సైడ్ డ్రైన్‌లు, సిమెంట్ రోడ్డులు త్వరలోనే ఏర్పాటు చేసేందుకు అధికారులు ఆదేశాలు జారీ చేశారు. వారు మౌలిక సదుపాయాలకు దూరం కాకుండా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

ఒంటరి వ్యక్తికి భరోసా కల్పించారు



నేను జగ్జీవన్‌రామ్ కాలనీలో మొదటి నుంచి ఉంటున్నాను, మా కుటుంబ సభ్యులంతా వేరే గ్రామాల్లో నివసిస్తున్నారు. కానీ నేను మాత్రమే ఇదే కాలనీలో పొలం పనులకు వెళ్తూ జీవనం సాగిస్తూ ఉండేదాని, కానీ నాకు ఇంటి పట్టా ఇస్తే భరోసా కలిగిది అని ఆశపడ్డాను ఆ ఆశను ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెరవేర్చింది.

– మురుకుపూడి మరియమ్మ, బాబు జగ్జీవన్‌రామ్ కాలనీ వాసీ

జగనన్నను నమ్ముకున్నా పట్టా ఇప్పించాడు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రావాలని, నా పెద్ద కొడుకు వస్తేనే నాకు ఏదైనా భరోసా వచ్చిదని బలంగా నమ్మాను. అదేవిధంగా ఇక్కడ కాసు మహేష్ రెడ్డి గెలవడం మా మొర ఆలకించి మాకు పట్టాలిచ్చాడు. జగనన్నను నమ్ముకుంటే ఏదైనా చేసిపెడతాడు. ఇప్పుడు సొంత ఇంటి పట్టారావడం సంతోషంగా ఉంది.

– కందుల కోటమ్మ, బాబు జగజ్జీవన్‌రావు కాలనీ వాసీ

ఏళ్ల తరబడి నేతల చుట్టూ తిరిగాను



నేను కాలనీలో ప్రజలందరికి పట్టాలు కావాలని గతంలో తెలుగు దేశం పార్టీ నాయకుల చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగి వేశారి పోయాను. కానీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి తమ కాలనీలో 40 రోజుల క్రితం పర్యటించగా అన్న మా కాలనీకి పట్టాలిప్పించన్నా అని చెప్పాను. వెంటనే తహసీల్దార్‌తో మాట్లాడి 420 మందికి పట్టాలు ఇప్పించారు.

– కొంగని ప్రశాంతి, బాబు జగజ్జీవన్‌రావు కాలనీ వాసీ

పండుగలు సాంప్రదాయాలకు ప్రతీక



సంక్రాంతి వేడుకల్లో భాగంగా ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



సంక్రాంతి సంబరాల్లో వివిధ వేషధారణలో విద్యార్థులు



ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థినులతో అధ్యాపకులు



స్కూల్‌లో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

మాచర్లరూరల్: మన పండుగలు సంస్కృతి, సాంప్రదాయాలకు నెలవని, భావితరాలకు ఇవి అందించే బాధ్యత మనందరి పై ఉందని హెచ్ఎం తెల్ల నాగ మురళి అన్నారు. బుధవారం మండలంలోని గన్నవరం ఎంపీయూపి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి వేడుకలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి బాలలే రేపటి భావి పౌరులన్న మన పెద్దల స్ఫూర్తితో పండుగలను మనం జరుపుకోవాలని సంక్రాంతి అనేది పల్లె, రైతుల పండుగని, అలాంటి పండుగను విద్యార్థులు భోగి మంటలు, ముగ్గులు, రంగవల్లులు రంగరించి, కొత్త బట్టలు ధరించి మన సాంప్రదాయాలను తెలిపే కార్యక్రమాన్ని చేపట్టడం ఆనందకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు షేక్ సిలార్ అహ్మద్, కె శ్రీనివాసరావు, వి లింగం, నిర్మలా మేరి, మారుతిరావు, దీప్తి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు

దాచేపల్లి : సంప్రదాయాలను ప్రతి ఒక్కరు కాపాడాలని ఎంఈఓ శ్రీనివాసరావు అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, స్కాలర్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు బుధవారం నిర్వహించారు. సంప్రదాయాలు ప్రతిబించేలా విద్యార్థులు వేషధారణ చేశారు. విద్యార్థులు వేసిన అందమైన ముగ్గులు ఆకట్టుకున్నాయి. విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సంక్రాంతి పండుగ తెలుగు ప్రజల లోగిళ్లలో జరిగే మొదటి పండుగ అని, ఈ పండుగతో రైతుల కుటుంబాలు పంట దిగుబడులతో కళకళలాడుతాయన్నారు. ముగ్గుల పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మైలా రంగారెడ్డి, ప్రతాప్ రెడ్డి, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాల మధ్య ముగ్గుల పోటీలు

వెల్దుర్తి: రేగిపండ్లు, రంగవల్లులు, భోగిమంటలు, హరిదాసుల సంకీర్తనలు, గంగిరెద్దుల కోలాహలాలు మన సంస్కృతికి ప్రతీకలను వాటిని కాపాడుకునే బాధ్యత మనందరి పై ఉందని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి అన్నారు. బుధవారం మాచర్ల పట్టణంలోని చక్రధర్ పిజీ కళాశాల ఆవరణలో సంక్రాంతి ముగ్గుల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి శోభకు ఇది మరిన్ని వన్నె తెస్తాయన్నారు. సంక్రాంతి ప్రతి ఇంటికి వెలుగు తీసుకొస్తోందన్నారు. పోటీలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు విడేల శ్రీనివాసరావు, కళాశాల డైరెక్టర్ మహేశ్వరరెడ్డి, నాగూర్‌వలి, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు, ఉపాధ్యాయులు రాణి, ప్రసన్న జ్యోతి, అరుణ, మణిదీపిక, నవీన్, కొండలు, విద్యార్థులు పాల్గొన్నారు. వికాస్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు మకర సంక్రాంతి పండుగను పురస్కరించుకొని వికాస్ కళాశాలలో ముగ్గుల పోటీలు నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు, టౌన్ ఎస్ఐ అరుణ, కెనరా బ్యాంకు మేనేజర్ సిహెచ్ గంగాధర్ పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

కోలాహలంగా ముగ్గుల పోటీలు

రెంటచింతల: స్థానిక ఫాతిమా విద్యానికేతన్ స్కూల్‌లో సంక్రాంతి పర్వ దినాన్ని పురస్కరించుకుని బుధవారం నిర్వహించిన రంగవల్లిల పోటీలు, భోగి మంటలు, హరిదాసు వేషదారణ, కోడిపందాలు, గాలి పటాలు ఎగురవేయడం వేడుకలు కోలాహలంగా జరిగాయి. రంగవల్లిలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని అనేక రకాల ముగ్గులను వేసి ఆకట్టుకున్నారు. మన సంస్కృతి సంప్రదాయాలు ఉట్టిపడేలా విద్యార్థినులు ముగ్గులను వేసి తమ ప్రతిభను చాటుకున్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఏరువ ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఏ రంగంలో ఉన్నా మన మూలాలు మరువకూడదన్నారు. మన సంస్కృతి సంప్రధాయాలు మన భావి తరాలకు ఈ పండుగలు నిర్వహించడం వలనే తెలుస్తాయన్నారు. అనంతరం డైరెక్టర్ ఏరువ మల్రెడ్డి, హెచ్ఎం ఏరువ స్టేఫీ విజేతలైన విద్యార్థినిలకు ప్రోత్సాహ బహుమతులను అందజేశారు.

భద్రతా నియమాలు పాటిస్తూ విధులు నిర్వహించాలి

రెంటచింతల: కర్మాగారాల్లో పనులు చేసే సమయంలో కార్మికులు భద్రతా నియమాలు పాటిస్తూ...విధులు నిర్వహించాలని పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీ ఎంఎస్ఎన్ రాజు అన్నారు. బుధవారం సత్రశాల సమీపంలో నున్న పరాశక్తి సిమెంట్ ఫ్యాక్టరీలో నిర్వహించిన 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రమశిక్షణతో ఉంటూ భద్రతా సిగ్నెల్స్‌ను పాటించాలన్నారు. ముందుగా భద్రతా జండాను ఆవిష్కరించి కార్మికులతో కలిసి ప్రతిజ్ఞ చేయించి అనంతరం ఫ్యాక్టరీ ఆవరణలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అధికారులు, కార్మికులు తదితరులున్నారు.

మాచర్ల వాసవి క్లబ్ అధ్యక్షుడిగా ఓరుగంటి



ఓరుగంటి చెన్నకేశవరావును సన్మానిస్తున్న జిల్లా గవర్నర్ విజయలక్ష్మి

వెల్దుర్తి: వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులుగా ఓరుగంటి చెన్నకేశవరావును నియమిస్తూ జిల్లా గవర్నర్ కజ్జాయం విజయలక్ష్మి నియామక పత్రాన్ని అందజేశారు. 2023 సంవత్సరానికి క్లబ్ అధ్యక్షుడిగా చెన్నకేశవరావును ఎంపిక చేయడం సంతోషకరమన్నారు. విజయలక్ష్మి మాట్లాడుతూ మాచర్ల పట్టణంలో కార్యదర్శి పందిరి నరసింహారావు, కోశాధికారి ముప్పవరపు నాగార్జునలను ఎంపిక చేసినట్లు తెలిపారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో గత కొన్నేళ్ళుగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రపంచ వ్యాప్తంగా వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏటా రూ. 90 కోట్ల నిధులు పేదలు అభివృద్ధికి ఖర్చు చేయడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా విద్యా, ఆరోగ్యానికి పెద్ద పీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో క్యాబినెట్ సెక్రెటరీ అరవపల్లి వెంకట సత్యనారాయణ, జోన్ చైర్మన్ మేడం నాగేశ్వరరావు, వాసవి క్లబ్ నాయకులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, చుండూరు వెంకటేశ్వర్లు, కొత్తమాసు పాండు రంగారావు, విడేల శ్రీనివాసరావు, చుండూరు సత్యనారాయణ తదితరులు అభినందించారు.

డెంగీ కేసు బాలుడుని పరీక్షించిన వైద్యాధికారులు

రాజుపాలెం: మండలంలోని కోటనెమలిపురిలో డెంగీ కేసు నమోదైన ఇంటి పరిసరాలను వైద్యాధికారుల బృందం బుధవారం పరిశీలించారు. గ్రామానికి చెందిన పి.హనుమయ్య కుమారుడు వసంతమణి అనే ఎనిమిదేళ్ల బాలుడికి ఈ నెల 7వ తేదీన జ్వరం రావడంతో ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందాడు. అయిన జ్వరం తగ్గక పోవడంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు రక్త పరీక్షలు నిర్వహించి బాలుడికి డెంగీ కేసుగా నమోదు చేశారు. ఆ సమాచారాన్ని రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తెలియపరిచారు. పల్నాడు జిల్లా మలేరియా అధికారి కె.రవింద్రరత్నాకర్, ప్రాథమిక ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటకృష్ణకుమార్, సిబ్బంది కోటనెమలిపురి వెళ్లి బాలుడి పరిస్థితిని తెలుసుకునిబాలుడు ఆరోగ్యంగా ఉన్నట్లు గుర్తించారు. ఇంటి పరిసరాల్లో చుట్టూ జ్వరాల సర్వే, యాంటీ లార్వా సర్వే చేసి నమోదు చేశారు. పంచాయతీ వారి సహకారంతో సున్నం, బ్లీచింగ్‌ను చల్లించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మలేరియా సబ్ యూనిట్ అధికారి ప్రభాకర్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు జీవన్‌రావు, గంగాధర్, పి.లక్ష్మీ, దుర్గా, ఏఎన్ఎంలు మేరీ, రాజు, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వివేకానంద 161 జయంతి



స్వామి వివేకానంద జయంతి వేడుకల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వెల్దుర్తి: స్వామి వివేకానంద 161 జయంతి ఉత్సవాలను మాచర్ల పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలికోన్నత పాఠశాలలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాచర్ల జూనియర్ సివిల్ జడ్జి మధుబాబు హాజరై మాట్లాడారు. శ్రీరామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరూ స్వామి వివేకానందని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి, హెచ్ఎం ఐవి నాగమణి, సంగీత ఉపాధ్యాయులు చినలాలూ సాహెబ్, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

చిరువ్యాపారులకు ఆర్థిక భరోసా



సీఎం వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న సర్పంచ్ వెంకట్రామయ్య, డ్వాక్రా గ్రూపు మహిళలు, సచివాలయ సిబ్బంది

మాచర్లరూరల్: చిరువ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న తోడు పథకం ఎంతగానో ఉపయోగపడుతుందని సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య అన్నారు. బుధవారం తాళ్ళపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రంలో నిర్వహించిన ముఖ్యమంత్రి వీడియో కాన్ఫరెన్సులో వారు పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 3.95 లక్షల మంది చిరువ్యాపారులకు రూ. 10వేల చొప్పున రూ. 395 కోట్ల వడ్డీ లేని ఋణం, రూ. 15.17 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్ అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఋణపడి ఉంటామన్నారు. నిరుపేదలైన చిరువ్యాపారులు, హస్త కళాకారులు, చేతివృత్తులు చేసుకునే వారికి వడ్డీ వ్యాపారుల బారి నుంచి రక్షించేందుకు ప్రభుత్వం లక్ష్యంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి ఆవుల వెంకట్రామయ్య, వీఆర్ఓ హుస్సేన్, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కోసం నిధులు ఖర్చుచేయాలి

ఎంపీడీఓ కాశయ్య

పిడుగురాళ్ల: ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మౌలిక వసతుల కోసం నిధులు ఉపయోగించాలని ఎంపీడీఓ కాశయ్య తెలిపారు. పట్టణంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ కమిటీ సమావేశంలో మండల అభివృద్ధి నిధులకు సంబంధించి ఆరోగ్య కేంద్రానికి సుమారు రూ. 1. 70 లక్షలు ఉన్నాయని, అందులో కొంత నిధులతో మౌలిక వసతుల కోసం నిధులు వినియోగించుకోవాలని ఈ సందర్భంగా ఎంపీడీఓ తెలిపారు. అలాగే వైద్యురాలు ప్రభావతి హాస్పటల్‌లో కావాల్సిన మౌలిక వసతుల గురించి అభివృద్ధి కమిటీతో చర్చించారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, ఇన్‌చార్జి ఎంపీపీ సాతులూరి బాబు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు తాటికొండ చిన్న ఆంజనేయులురెడ్డి, పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోను రాణించాలి

పట్టణ సీఐ మధుసూధన్‌రావు



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న సీఐ మధుసూధన్‌రావు

పిడుగురాళ్లరూరల్: విద్యార్థులకు చదువుతోపాటు ఆటలు కూడా ముఖ్యమేనని పిడుగురాళ్ల పట్టణ సీఐ ఎం. మధుసూదన్‌రావు అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లి శివారులోని గీతిక సీబీఎస్‌సీ స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్ పోగ్రాంకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదవడం వల్ల మానసిక అలసట పొందుతున్నారని వారికి ఆటలు ఆడించడం ద్వారా వారిలో మానసిక, శారీరకంగా ధృడంగా ఉంటారని ఆయన తెలియజేశారు. ర్యాంక్‌లే కాకుండా ఆటల్లో కూడా రాణించిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని ఆయన తెలియజేశారు. అనంతరం ఆటల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో చైర్మన్ టి. బాలగంగాధర్‌రెడ్డి, డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న కౌన్సిలర్ అజ్మిర శారద, సచివాయల కన్వీనర్ ఇల్లూరి వెంకయ్య

పిడుగురాళ్ల: అర్హులైన అందరికి లబ్ధి చేకూరుతుందని కౌన్సిలర్ అజ్మిర శారద అన్నారు. పట్టణంలోని 6వ వార్డులో కొత్తగా ఇళ్ల పట్టాలు మంజూరైన లబ్ధిదారుల ఇంటికి వెళ్లి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాబోయే తరాలకు నివాసం కల్పించాలని, ఉంటున్న కుటుంబాలకు భరోసా కల్పించాలనే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి పేదవాడికి ఇళ్ల స్థలం కేటాయిస్తున్నారు. అదేవిధంగా కాలనీలో ఎంత మంది అర్హులు ఉంటే అంతమందికి ఇళ్ల పట్టాలు కేటాయించమని ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారని, ఆయన అడుగు జాడల్లో నడవడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ ఇన్‌చార్జి కొండలు, సచివాలయ కన్వీనర్ ఇల్లూరి వెంకయ్య, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



క్రికెట్ ఆడి ప్రారంభిస్తున్న పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి

వెల్దుర్తి: క్రీడలతో దేహదారుఢ్యంతో పాటు, మానసిక ఉల్లాసం పెరుగుతుందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం మాచర్ల పట్టణంలోని ఎస్‌కెబిఆర్ బంగ్లా గ్రౌండ్‌లో జమ్మలమడక వైఎస్సార్ సీపీ యూత్ ఆధ్వర్యంలో సంక్రాంతి సందర్భంగా జిల్లా స్థాయి వైఎస్సార్ టోర్నమెంట్ క్రికెట్ పోటీలను పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని క్రికెట్ బ్యాట్‌తో ఆడి పోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాచర్ల సొసైటీ అధ్యక్షుడు గుత్తికొండ సత్యనారాయణరెడ్డి, బూడిద శ్రీనివాసరావు, చందూ గౌడ్, సాయి, క్రీడాకారులు పాల్గొన్నారు.

రైతులు సాగు చేసుకుంటున్న భూములకే పట్టాలు

ఆర్డీఓ అద్దయ్య



ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ అద్దయ్య, తహసీల్దార్ పుల్లారావు

రెంటచింతల: ఎంతో కాలంగా నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు మాత్రమే డీ ఫారం పట్టాలను మంజూరు చేయడం జరుగుతుందని గురజాల ఆర్డీఓ కె.అద్దయ్య అన్నారు. బుధవారం ఆయన రెంటచింతల తహసీల్దార్ కట్టెకోట పుల్లారావుతో కలిసి మండలంలోని పాలువాయి గ్రామంలో సర్వే నంబర్లు 281, 650, 739, 822 లలో ఉన్న సాగు చేసుకుంటున్న 18 ఎకరాల ప్రభుత్వ భూములను పరిశీలించారు. 10 మంది రైతులు ఈ ప్రభుత్వ భూములను గత 20 సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నారు. వారు పెట్టుకున్న అర్జీ మేరకు జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ అద్దయ్య క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి పూర్తి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు పంపినున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో డివిజనల్ సర్వేయర్ కె.జయరావు, సర్వేయర్ కళ్యాణ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.